ఇన్‌స్టా ముసుగులో వలపువల

- ఎన్నారైని బ్లాక్‌మెయిల్ చేసి నిశ్చితార్థం
- భారీగా డబ్బు వసూలుకు ప్లాన్
- బాధితుడి ఫిర్యాదుతో యువతి అరెస్టు
- విశాఖపట్నంలో వెలుగుచూసిన ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయాలతో యువకులను ముగ్గులోకి దింపి వారి నుంచి డబ్బులు గుంజుతూ మోసాలకు పాల్పడుతున్న యువతిని ఏపీ పోలీసులు అరెస్టుచేశారు. భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని మురళీనగర్‌కు చెందిన కొరుప్రోలు జోయ్ జమీనా అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐ మనోహర్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నది. వైజాగ్‌లో నివాసముంటున్న ఆ యువకుడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మనోహర్ స్నేహితురాలిని అంటూ పరిచయం చేసుకున్నది. కొన్ని రోజుల పాటు వారితో మంచిగా నటిస్తూ మీ అబ్బాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పగా వారు నిరాకరించారు. దీంతో ఆమె అమెరికా నుంచి యువకుడిని రప్పించి ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా మురళీనగర్ ఎన్జీవో కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లింది. మత్తు పానీయం ఇచ్చి ఇరువురు సన్నిహితంగా ఉంటున్నట్టు ఫొటోలు తీసింది. వాటితో తనను పెళ్లి చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేసింది. భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో రూ.5 లక్షలు ఖర్చు చేయించి తన స్నేహితుల సమక్షంలో బలవంతంగా నిశ్చితార్థం చేయించుకున్నది. అనంతరం పెళ్లి చేసుకోకపోతే అభ్యంతరకర ఫొటోలను బహిర్గతం చేస్తానని బెదిరిస్తూ వేధింపులకు గురిచేసింది. ఎన్నారై మనోహర్‌ను రోజుల తరబడి ఇంట్లో బంధించింది. ఎట్టకేలకు ఆమె నుంచి తప్పించుకున్న బాధితుడు.. ఈ నెల 4న భీమిలి పోలీస్‌స్టేషన్‌లో యువతిపై ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితురాలి నుంచి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇదే తరహాలో పలువురిని మోసగించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారించి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నోటీసు చూపిస్తున్న చంద్రనాయక్

కోర్టు నుంచి వచ్చిన నోటీసు

తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు నోటీసులు

- సకలజనుల సమ్మెలో ఆర్టీసీ బస్సు ఆపినందుకు..
- అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు
- నవంబర్ 19న హాజరుకావాలని 28 మందికి సమన్లు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 6: ప్రత్యేక రాష్ట్రం కోసం 2011లో సకల జనుల సమ్మె సమయంలో అప్పటి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్టీసీ బస్సులను ఆపారు. అందుకుగానూ.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్ ఉద్యోగ సంఘం నాయకులపై అక్రమ కేసులను బనాయించింది. తాజాగా మళ్లీ పాత కేసులను బయటకు తీసి వారికి నోటీసులు పంపడం బాధాకరం. 28 మంది తెలంగాణ ఉద్యమకారులకు నోటీసులు పంపి.. నవంబర్ 19న కోర్టుకు హాజరు కావాలని పేర్కొన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యమాన్ని తమ భుజస్కంధాలపై మోస్తూ సబ్బండ వర్గాలను ఏకం చేసిన ఉద్యోగ సంఘం నాయకులకు తాజాగా నోటీసులు రావడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నోటీసులందుకున్న 28 మందిలో 15 మంది ఇప్పుడు ఉద్యోగ విరమణ పొందారు. వారి వయస్సు 70 ఏండ్ల పైబడింది. నలుగురు మహిళా ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా ఆ కేసును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యమ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కనుల పండువగా గంగానీళ్ల జాతర

సారంగాపూర్/దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : నిర్మల్ జిల్లా సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో గంగానీళ్ల జాతర అంగరంగా వైభవంగా ముగిసింది. ఆదివారం భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. పవిత్ర కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలో నిలబడి మొక్కులు తీర్చుకున్నారు. గంగానీళ్ల జాతరను పురస్కరించుకొని నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పోచమ్మ తల్లికి మొక్కలు చెల్లించుకున్నారు.

- కూష్మాండ మాతగా ఏడుపాయల దుర్గమ్మ

మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గమ్మ కూశ్మాండ మాత అలంకరణతో దర్శనమిచ్చారు. – పాపన్నపేట

- మహాలక్ష్మి అలంకరణలో..

మహబూబ్‌నగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.6,66,66,666తో అలంకరించారు. – పాలమూరు

- లలితా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి కిక్కిరిసిపోయింది. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

- ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారు



శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మలయప్పస్వామి ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

ఈబీసీలపై కాంగ్రెస్ వైఖరేంటి?: రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఈబీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరేమిటో స్పష్టం చేయాలని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఈబీసీల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వీ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈబీసీల జోలికొస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.

గోమాతకు పుట్టిన రోజు వేడుకలు

జగిత్యాలజిల్లా బీర్‌పూర్‌లో ఓ రైతు కుటుంబం లేగదూడకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించింది. బైరవేని సత్యనారాయణ- భాగ్యలక్ష్మి దంపతులు పెంచుకుంటున్న ఆవుకు పుట్టిన లేగదూడకు ఆదివారంతో సంవత్సరం నిండింది. ఈ క్రమంలో వేద పండితుడి ఆధ్వర్యంలో గోమాతకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేట్ కట్ చేసి.. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. – సారంగాపూర్

డొక్కు బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో డొక్కు బస్సుల స్థానంలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులను తెచ్చేందుకు సంస్థ ప్లాన్ చేస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి గత పదేండ్లలో ఏకంగా 6,680 డొక్కు బస్సులను ఆర్టీసీ తుక్కు కింద వేలం వేసి అమ్మేయగా, వాటిస్థానంలో 4,226 బస్సులను కొనుగోలు చేసింది. ప్రస్తుతం వెంటనే తుక్కుగా మార్చాల్సిన 1,213 డొక్కు బస్సుల స్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ఇటీవలే ఆర్టీసీ నివేదిక పంపింది. పీఎం ఈ డ్రైవ్ పథకంలో హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని సంస్థ ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్నది. నగరం అవసరాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం మరో 2,300 ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకునే చాన్స్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఒక్కో బస్సు ధర రూ.1.85 కోట్లు ఉండడంతో అద్దెకు తీసుకోవాలని యోచిస్తున్నది.

సింగూరు రెండు గేట్లు ఎత్తివేత

పుల్కల్, అక్టోబర్ 6: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆదివారం 6, 11వ నంబర్ గేట్లు 1.50 మీటర్ల మేర ఎత్తి 11,026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్తు ఉత్పత్తి కోసం జెన్కోకు 2,796 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆదివారం 13,076 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, 14,453 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగినట్టు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.708 టీఎంసీలు నీరు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

మట్టి తవ్వకాలకు అండగా ప్రభుత్వం?

- నాడు ఇదే తవ్వకాల్లో అప్పటి మంత్రిపై తప్పుడు ప్రచారం
- నేడు అధికారంలో ఉండి అదే మట్టి తోలకాలకు సహకారం
- స్థానికులు ప్రశ్నించినా నిలువరించని అధికారులు
- స్టేషన్‌కు వచ్చి మాట్లాడాలంటున్న పోలీసులు
- ముక్కున వేలేసుకుటున్న మండల ప్రజలు

రఘునాథపాలెం, అక్టోబర్ 6:నాడు మట్టి తవ్వకాలు జరుగుతుంటే అప్పటి మంత్రి ప్రమేయంతోనే అన్నారు. తవ్వకాలు జరిగేది గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసమేని చెప్పినా తప్పుడు ప్రచారం చేశారు. ఎన్నికల సమయంలో ఇదే మట్టి తవ్వకాలను అస్త్రంగా మార్చుకున్నారు. పనిగట్టుకొని మరీ విష ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి మరీ వివరించి చెప్పారు. అప్పటికే మంత్రే ఈ తవ్వకాలకు ఆద్యుడంటూ 'కోడై' కూశారు. ఒక్కమాటలో చెప్పాలంటే మట్టి తవ్వకాలను బూచీగా చూపి అప్పటి మంత్రి అజయ్ ఓటమికి కారణమయ్యారు. కానీ ఆ మట్టి తవ్వకాలు నేటికీ జరుగుతూనే ఉన్నాయి. అయితే అప్పుడు మాట్లాడినోళ్ల నోళ్లు ఇప్పుడు తెరుచుకోవడం లేదు. నిజంగా ఆ మట్టి తవ్వకాలు అక్రమమైతే ఇప్పుడు అధికారంలో ఉన్న పాలకులెందుకు వాటిపై చర్యలు తీసుకోవడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారం ఎలాగూ చేతిలో ఉంది కాబట్టి తవ్వకాలను ఎందుకు నిలిపివేయడం లేదని సూటిగా ప్రశ్నలు సంధిస్తున్నారు. అదే మట్టిగుట్టలు ఇప్పటికీ మాయమవుతున్నాయని, సహజ వనరులు కానరాకుండా కాంగ్రెస్ నేలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మట్టి తవ్వకాల విషయంలో కాంగ్రెసోళ్లు నాడు ఉద్దేశపూర్వకంగానే అప్పటి మంత్రి అజయ్‌కుమార్‌పై బురద చల్లారనే విషయం తేటతెల్లమైందని చెబుతున్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం అబద్ధాలు ఆడి తమను తప్పుదోవ పట్టించారనే విషయం తమకు తెలిసిపోయిందని అంటున్నారు.

మరింత పెరిగిన మట్టి తవ్వకాలు..

అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇదే రఘునాథపాలెం మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు మరింత పెరిగాయి. కొందరు కాంగ్రెస్ నాయకుల అండతో మట్టి అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. పగలూ రాత్రీ తేడా లేకుండా మట్టి తోలకాలను చేపడుతున్నారు. రఘునాథపాలెం బైపాస్ రోడ్డు సర్కిల్ కేంద్రంగా ఉన్న మట్టి మాఫియాకు కాంగ్రెస్ నాయకులు ఊతమందిస్తున్నారు. కనీసం మట్టి తవ్వకాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదంటే ప్రత్యక్షంగా అధికార పార్టీ నాయకులు మట్టి తవ్వకాల విషయంలో అక్రమార్కులకు ఎంతలా ఊతమిస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. రోడ్లన్నీ ఛిద్రమవుతున్నందున 'మట్టి తోలకాలతో నిలిపివేయండి మహాప్రభో..' అని మొత్తుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

సోషల్ మీడియాలో ఆడియో చక్కర్లు..

ఇటీవల గురువారం రాత్రి రఘునాథపాలెం పంచాయతీ యాకూబ్‌నగర్‌కు చెందిన పలువురు స్థానికులు ఈ ఇబ్బందిని తాళలేక మట్టి తవ్వకాలకు చెందిన టిప్పర్లను అడ్డుకున్నారు. సూపర్‌వైజర్‌కు ఫోన్ చేయగా నిర్లక్ష్యంగా మాట్లాడటంతోపాటు స్థానిక సీఐకి ఫోన్ కలిపి బెదిరింపులకు గురి చేశాడు. అయినప్పటికీ యాకూబ్‌నగర్ కాలనీవాసులు భయపడకుండా సీఐతో మాట్లాడారు. అయితే సీఐ మాటలు అక్రమార్కులకు ఊతమిస్తున్నట్లుగా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. ఏదైనా ఉంటే తహసీల్దార్‌ను కలవాలని, లేదంటే పోలీసుస్టేషన్‌కి వచ్చి మాట్లాడాలని తమపై హూంకరించారని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ సంభాషణల ఆడియో కాస్తా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. అధికార పార్టీ అండతో మండలంలో సాగుతున్న మట్టి మాఫియా ఆగడాలను నిలువరించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు పిల్లలు మృతి

- రఘునాథపాలెం మండలం పాపటపల్లిలో బాలుడు
- గుండాల మండలం వెన్నెలబైలులో బాలిక

చరణ్‌తేజ్ (ఫైల్)

సువర్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రఘునాథపాలెం/ గుండాల, అక్టోబర్ 6: విద్యుదాఘాతంతో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు చిన్నారులు మృతిచెందిన ఘటనలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్నాయి. బతుకమ్మ కోసం పూలు కోస్తుండగా ఓ బాలుడు, ఫ్యాన్ వైరును పక్కకు తొలగిస్తుంగా ఓ బాలిక మృతిచెందాడు. ఆయా ప్రమాదాల్లో చిన్నారులు మృతిచెందడంలో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

బతుకమ్మ పూలు కోస్తుండగా..

బతుకమ్మ పూలు కోస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో బాలుడు మృతి చెందాడు. ఖమ్మం రఘునాథపాలెం మండలంలోని పాపటపల్లి గ్రామంలో ఆదివారం ఇది జరిగింది. మిట్టపల్లి చరణ్ తేజ్(15) 10వ తరగతి చదువుతున్నాడు. తమ ఇంట్లో 5వ రోజు బతుకమ్మ వేడుక కోసమని ఆవరణలోగల టేకు చెట్టు పైన ఉన్న పూలు కోసేందుకు డాబా పైకి ఎక్కాడు. పూలు కోస్తుండగా, పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌కు చేయి తగిలింది. విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యుత్ తీగలు కిందకు ఉన్నాయని, విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆ బాలుడి కుటుంబ సభ్యులు చెప్పారు. బాలుడి తండ్రి ఫిర్యాదుతో సీఐ ఉస్మాన్ షరీఫ్ కేసు నమోదు చేశారు.

ఫ్యాన్ వైరును పక్కకు తొలగిస్తుండగా..

భద్రాద్రి జిల్లా గుండాల మండలంలోని వెన్నెలబైలు గ్రామానికి చెందిన ఇర్ప కృష్ణారావు కుమార్తె ఇర్ప సువర్ణ(12) ఆదివారం తమ ఇంటి రేకులకు ఉన్న ఫ్యాన్ వైరును పక్కకు తొలగించబోయింది. అప్పటికే ఆ వైరును ఎలుకలు కొరికి వేయడంతో లోపలి తీగలు బయటకు కనిపిస్తున్నాయి. దీనిని ఆమె గమనించకుండా, పట్టుకోవడంతో షాక్‌తో కుప్పకూలింది. కుటుంబీకులు వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే బాలిక మృతి చెందినట్లు చెప్పారు. ఈ బాలిక, అదే గ్రామంలోని పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నది. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోస్ట్‌మార్టం కోసం మృతదేహాన్ని ఇల్లెందు ఆస్పత్రికి పోలీసులు తరలించారు. గుండాల ఎస్ఐ రాజమౌళి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టడీసెంటర్‌ను ప్రారంభించిన వద్దిరాజు

అక్షర స్పేస్ స్టడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, అక్టోబర్ 6 : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర హైదరాబాద్ దోమలగూడలోని అరవింద్‌నగర్‌లో ఆదివారం అక్షర స్టడీ స్పేస్‌ను ప్రారంభించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే యువత కోసం మున్నూరు కాపు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి అనిల్ పటేల్ ఏర్పాటు చేసిన ఈ స్టడీసెంటర్‌లో ఏసీతో పాటు అనువైన కుర్చీలు, టేబుల్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, సుధీర్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంజీవ్, అనిల్, యాద క్రాంతి, సీహెచ్ మహేందర్, మామిడి బాలకృష్ణ, సంజీవ్, అశోక్‌రెడ్డి, శ్రీను, రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్, చందు, కిశోర్, హుస్సేన్ పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌ను పరామర్శించిన ఎంపీలు

ఖమ్మం, అక్టోబర్ 6 : ఇటీవల తండ్రిని కోల్పోయిన రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు ఆదివారం పరామర్శించారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని తన చెల్లెలు నివాసంలో ఉన్న ఉత్తమ్‌ను ఎంపీలతోపాటు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు ఉత్తమ్ పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలు జల్లి ఘనంగా నివాళులర్పించారు. ఉత్తమ్ కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వాలి

బోనకల్లు, అక్టోబర్ 6: ప్రభుత్వాలు ఉచితాలు, ఆకర్షణ పథకాలకు ప్రాధాన్యం తగ్గించి నాణ్యమైన విద్య, వైద్యాన్ని ఉచితంగా ఇవ్వాలని ప్రముఖ విద్యావేత్త, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు మాజీ జాయింట్ సెక్రెటరీ కర్నాటి రామ్మోహన్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రత్యేక వైద్య క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాటి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. బత్తినేని చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో బీపీ, షుగర్, కంటి నిర్వహణ కమిటీ సామాజిక స్పృహతో పేదలకు వైద్యం అందిస్తున్న వైద్యులను, క్యాంపు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో వైద్యనిపుణులు టీ.పవన్‌కుమార్, డీ.సాయికుమార్, నాయకులు తోట రామాంజనేయులు, బొమ్మినేని కొండలరావు, తూము రోషన్, ఆకెన పవన్, పిల్లలమర్రి వెంకటఅప్పారావు, షేక్ హుస్సేన్, దారగాని కృష్ణమూర్తి, ఏలూరి పూర్ణచంద్రరావు, కొంగర కృష్ణయ్య, యంగల గిరి, వీ.సాగర్, విజయ పాల్గొన్నారు.

ముగిసిన మత్స్య రైతుల శిక్షణ

కూసుమంచి, అక్టోబర్ 6 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూల్డ్ కులాల రైతులకు మంచి ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. కూసుమంచి మండలం పాలేరులోని పీవీ నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన నాగర్‌కర్నూల్ జిల్లా సహకార సంస్థకు చెందిన 25 మందికి మూడ్రోజులపాటు అందిస్తున్న శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మత్స్య రైతులకు ఇక్కడ ఇచ్చిన శిక్షణ చాలా ఉపయోగపడుతుందని అన్నారు. శాస్త్రవేత్త రవీందర్ మాట్లాడుతూ చేపలు మంచిగా పెరగాలి అంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీనియర్ ఫెలోషిప్ రిజర్చ్ శివనాగరాజు మాట్లాడుతూ చేపల వ్యాధుల నివారణ గురించి తెలియజేశారు. శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాటేటి కిరణ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 6: ఖమ్మం నగరంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీ ఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంతోష్ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బలుసు మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంటును రెండోరోజు ఆదివారం ఖమ్మం నగర బీఆర్ఎస్ నాయకుడు మాటేటి కిరణ్‌కుమార్ ప్రారంభించారు. సంతోష మెమోరియల్ టోర్నమెంట్‌లో జిల్లావ్యాప్తంగా పలు మండలాల నుంచి 40 జట్లు పాల్గొంటున్నాయి. మాటేటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బలుసు మురళి తన స్నేహితుడి పేరు మీద ఈ మ్యాచులు నిర్వహించడం స్నేహానికి ఉన్న విలువను తెలియచెబుతున్నదని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ బలుసు మురళీకృష్ణ, సాయి కళ్యాణ్, వియుకే ప్రాన్స్ ఉపేందర్, నజీర్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కోమటిల్లి సాయి కృష్ణచైతన్య, కొనపర్తి గోపి, ఆలేటి వెంకటేష్, కొమ్ము మహేష్, కే.సాయి, భరత్ దరి, అభి, నాని, హనీష్, పీ.సాయి, సాయి చందు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన హెల్త్ డైరెక్టర్

ఆసుపత్రిని పరిశీలిస్తున్న హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 6: సత్తుపల్లి ఏరియా ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీ.సుబ్బారావుతో కలిసి రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ బీ.రవీంద్రనాయక్ ఆదివారం పరిశీలించారు. ఆసుపత్రిలోని వార్డుల్లో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్స్, స్టాఫ్‌నర్సుల పోస్టులను త్వరలోనే భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ టీ.సీతారాం, డాక్టర్లు ప్రేమలత, సాంబశివరావు, నారాయణమ్మ, సాత్రిక్, హెచ్ఎన్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

లంకాసాగర్ పీహెచ్‌సీ సందర్శన

పెనుబల్లి, అక్టోబర్ 6: మండలంలోని లంకాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హెల్త్ డైరెక్టర్ డాక్టర్ బీ.రవీందర్‌నాయక్ సందర్శించారు. రోజువారి అవుట్ పేషెంట్స్, ఇన్ పేషెంట్ సేవల గురించి ఆరా తీశారు. ల్యాబ్‌లో జరుగుతున్న రక్త పరీక్షలు, డ్రగ్స్ స్టోర్‌లో మందుల నిల్వల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల నమోదులో జిల్లాలో ప్రథమస్థానంలో ఉన్నందుకు సిబ్బందిని అభినందించారు.

లంకాసాగర్ పీహెచ్‌సీకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న డీహెచ్

బాల్‌బ్యాడ్మింటన్‌లో ఖమ్మం బాలికల జట్టు విజయం

రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌లో విజయం సాధించిన ఖమ్మం జిల్లా జట్టు

బోనకల్లు, అక్టోబర్ 6: ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు కామారెడ్డి జిల్లా గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ షిప్‌లో ఖమ్మం బాలికల జట్టు విజేతగా నిలిచింది. ఖమ్మం జట్టు బాలికలు 10 మందికి 8 మంది బోనకల్లుకు చెందిన టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో చదువుతున్న బాలికలు ఉన్నారు. వీరు గతంలో సీనియర్ సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని చాంపియన్లుగా నిలిచారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీవీ.రమణ, ఎ.రవీంద్ర, ఎం.శ్రీనివాసరావు, డీ.దుర్గమ్మ, పీ.వీరభద్రరావు వీరికి బహుమతులు అందజేశారు. వీరి విజయం పట్ల అసోసియేషన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, అధ్యక్షుడు వీ.సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు టీ.రామచంద్రరాజు, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ పద్మావతి, కోచ్ అమరేషు లింగయ్య అనందం వ్యక్తం చేశారు. టీం మేనేజర్లుగా సీహెచ్.జగదీష్, బీ.గోపి, టీ.సంధ్యారాణి వ్యవహరించారు.

ఎంఆర్సీ మెసెంజెర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రుద్రగిరి

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 6 : తెలంగాణ రాష్ట్ర ఎంఆర్సీ మెసెంజర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ రుద్రగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కందుకూరి యాదగిరి, జిల్లా అధ్యక్షుడిగా ఇస్మాయి